క్లుప్తంగా

గొల్లవానితిప్పలో రోడ్డు విస్తరణ పనులు



గొల్లవానితిప్పలో జేసీబీతో విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మెయిన్‌రోడ్డుపై కొంతమంది గ్రామస్తులు, వ్యాపారులు మార్జిన్‌ను ఆక్రమించడంతో డ్రెయినేజీ, ట్రాఫిక్ సమస్యలు తరచూ ఏర్పడుతున్నాయి. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు జేసీబీ సహాయంతో మార్జిన్‌లో నిర్మాణాలను తొలగించి పక్కా డ్రెయినేజీని ఏర్పాటు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలో తాడేరు విద్యుత్ ఉపకేంద్రం నుంచి పెదగరువు విద్యుత్ ఉపకేంద్రం వరకు 33 కేవీ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట నిమిత్తం శుక్రవారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాడేరు, యమునాపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, దూసనపూడి, మత్స్యపురి పాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలతోపాటు తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కునకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, ఆచంట, పెనుగొండ పరిసర ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు ఉదయం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పూడిక పనులు త్వరగా పూర్తి చేయాలి

మొగల్తూరు: జగనన్న కాలనీల్లో పూడిక పనులు త్వరతగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ సిద్ధాంతి ఆదేశించారు. పూడిక తీత పనులకు ప్రభుత్వం రూ.7.50 లక్షలు మంజూరు చేయడంతో శుక్రవారం మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్పలోని జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. సుమారు 60 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించామని, లబ్ధిదారులు కూ డా ఇళ్ల నిర్మాణాలకు సిద్ధంగా ఉన్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ ఫణీంద్ర, పడవల సత్యనారాయణ తదితరులున్నారు.

అనారోగ్య బాధితురాలికి సాయం

పోడూరు: కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శాంతికుమారి కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యఖర్చులు భారంగా మారాయి. శాంతికుమారి పరిస్థితి తెలుసుకుని వసుధ ఫౌండేషన్ ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు గురువారం శాంతికుమారి భర్త వెంకట రామకృష్ణంరాజుకు ఆ సొమ్ము అందజేశారు. ఆర్థికసాయం అందించడంపట్ల శాంతి కుమారి కుటుంబసభ్యులు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

పాలకోడేరు: గరగపర్రు గ్రామానికి చెందిన డి.శ్రీను తన ఇంటి వద్ద నిలుపుదల చేసిన స్ప్లెండర్ వాహనం ఈ నెల 24న అపహరణకు గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం పెన్నాడలోని వైన్ షాపు వద్ద నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురయ్యిందని ధర్మారావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ఈబీసీ నేస్తం అగ్రవర్ణ పేదలకు వరం

పెనుగొండ: ఈబీసీ నేస్తం పథకం అగ్రవర్ణ పేదలకు వరం లాంటిదని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. గురువారం కొడమంచిలి రైతు కమ్యూనిటీ భవనంలో ఈబీసీ నేస్తం లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అగ్రవర్ణ పేదలకు అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కొడమంచిలిలో పార్టీలకతీతంగా 67 మంది లబ్ధిదారులకు రూ.9,45,000 జమ చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల సంక్షేమానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషి చేస్తున్నార న్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హినా భాను, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు డానియేలు, రాజకమల్ పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు శివారు వంకాయల పాలెం శ్రీ కోదండ రామస్వామి 9వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవం గురువారం అత్యంత వైభవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పెన్మత్స శ్రీనివాసరాజు ఆర్థిక సహాయంతో ఇటీవల ఆలయాన్ని ఆధునీకరించారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహారాజు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు నిర్మాణాలు, కల్యాణ మహోత్సవాలు జరిపించడం వల్ల గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని అన్నారు. పీవీఎల్ నరసింహారాజును, ఆధునీకరణ ప్రధాన దాత మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజును పూల గజమాలతో శాలువాలతో ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. స్వామి వారికి ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పెరుమాళ్ల వీరన్న ప్రియాంక దంపతులు స్వామి వారికి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, బొల్లా శ్రీనివాస్, పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, పెన్మత్స గోపాలకృష్ణంరాజు, ఎంపీటీసీ సభ్యులు బొల్లం గాంధీ, పెదపూడి లక్ష్మీపతి, షేక్ పాపా సాహెబ్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యురాలు డాక్టర్ బి.ఆర్ స్వర్ణలత, ఆలయ కమిటీ సభ్యులు పెరుమాళ్ల వీరన్న, పేరం శ్రీనివాస్, పల్లా వెంకన్న, పెరుమాళ్ల కోటేశ్వరరావు, కడలి దుర్గారావు సొసైటీ చైర్మన్ గెద్దం జీషి సాగిరాజు హరి వర్మ, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



కోదండరాముని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పీవీఎల్

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

కాళ్ల: భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని గురువారం పెదఅమిరం గ్రామంలో నిర్వహించారు. మండలంలో పెదఅమిరం గ్రామం లో ఉన్న ఉప్పరగూడెం, సాగరపేటలో భగిరథ మహర్షివిగ్రహం వద్ద జయంతి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, సర్పంచ్ డొక్కు సోమేశ్వర రావు, ఉప సర్పంచ్ జావ్వాది కిషోర్, ఇళ్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ



మజ్జి రాజశ్రీ



మజ్జి హారిక



పట్టపు సత్యశ్రీవల్లి



మౌనిక

సాక్షి, భీమవరం: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భీమవరం పట్టణంలోని గ్రంధి వెంకటేశ్వరరావు(జీవీఆర్) ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ గురువారం విలేకరులకు చెప్పారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఎంపీసీ విద్యార్థిని మజ్జి రాజశ్రీ 966 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలవగా బైపీసీ విద్యార్థిని మజ్జి హారిక 938 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థిని పట్టపు సత్యశ్రీవల్లి 441 మార్కులు, బైపీసీ విద్యార్థిని వర్ధనపు సుజాత 377 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ వివరించారు. తమ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 141 మంది హాజరుకాగా 88 మంది ఉత్తీర్ణులయ్యారని ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో 56 మందికి 27 మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు.

ఆకివీడులో..

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 73 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ బ్రహ్మం గురువారం చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 61 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్‌గా పి.మౌనిక నిలిచింది. బుధవారం విడుదలైన ఇంటర్ ఫస్ట్, సెకండీయర్ ఫలితాల్లో ఎంపీసీలో 1000 మార్కులకు గాను 958 మార్కులు పి.మౌనిక సాధించగా సీఈసీ గ్రూపులో 899 మార్కులు, హెచ్ఈసీలో జి.సంధ్యారాణి 911 మార్కులు సాధించారు.అలాగే ఒకేషనల్ కోర్సులో ఎల్.శ్రావణి 908 మార్కులు సాధించింది.

వీరవాసరం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

వీరవాసరం: సొసైటీ పాలకవర్గాలు రైతులకు అండగా నిలవాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు(బాబు) అన్నారు. వీరవాసరంలో కోపరేటివ్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని గురువారం ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. రైతుల శ్రేయస్సు ,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా కొలుపూరి గౌరి, సభ్యులుగా చికిలే విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన త్రిసభ్య కమిటీ ని వైఎస్సార్ సీపీ నాయకులు ,రైతులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి, అభినందించారు.ఈ సందర్భంగా నూతన త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ కొలుపూరి గౌరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కు, వైయస్సార్ పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం , మాజీ త్రిసభ్య కమిటీ చైర్మన్ మద్దాల సత్యనారాయణమూర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు బోను జోత్స్నదేవి, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, కార్యదర్శి శ్రీనివాస్, చికెలే మంగతాయారు, మానుకొండ ప్రదీప్ పాల్గొన్నారు.



కొలుపూరి గౌరిని అభినందిస్తున్న దృశ్యం

రక్తదానం ప్రాణదానంతో సమానం

సాక్షి, భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని రక్తదానం వల్ల దాతలకు ఎలాంటి నష్టం వాటిల్లకపోగా రక్తప్రసరణ మెరుగవుతుందని భీమవరం డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు అన్నారు. గురువారం కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్‌సీసీ కాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇటువంటి సేవా కార్యక్రమాలలో ముందుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 80 మందికిపైగా రక్తదానం చేశారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ వీరయ్య, పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, కొత్తపల్లి శివరామరాజు, సీహెచ్ కుమార దత్తాత్రేయవర్మ, సీహెచ్ జె సోమరాజు, ఎస్.అనిల్ దేవ్, కె.సోమయ్య, ఇ.భరత్ రాజు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న డీఎన్నార్ కళాశాల విద్యార్థులు

భీమవరం డీఎన్నార్ కళాశాలలో నూతన కోర్సులు

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ లా కళాశాల అభివృద్ధికి విద్యార్థుల్లో ప్రావీణ్యత పెంపొందించడానికి నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు చెప్పారు. గురువారం లా కళాశాల 34వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లా విద్యనభ్యసించిన విద్యార్థులు పేద, మధ్యతరగతి కక్షిదారులకు ఉచిత న్యాయసహాయం అందించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రాఘురామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, పాలకవర్గ సభ్యుడు చిరుకూరి కుమారదత్తాత్రేయవర్మ, కె.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సోషల్ ఆడిట్‌పై శిక్షణ

వీరవాసరం: పాఠశాలల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై పేరెంట్ కమిటీ సభ్యులందరూ అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి బి.వినాయకుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వినాయకుడు మాట్లాడుతూ పేరెంట్ కమిటీ సభ్యులు పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనేలా, అలాగే వారి సహకారం అందించేలా ప్రధానోపాధ్యాయులు వారిని చైతన్య పరచాలన్నారు. పాఠశాలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు నిధులు తదితర అంశాల గురించి వారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. సోషల్ ఆడిట్ రిసోర్స్ పర్సన్ రమణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు వారి హక్కులను గురించి తెలియజేయాలని అలాగే పేరెంట్ కమిటీ సభ్యులు పాఠశాలల్లో ఏ అంశాలు పరిశీలించాలి? వాటిపై ఏ విధంగా పై అధికారులను ప్రశ్నించాలి అనే అంశాలను తెలియజేయాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు అభివృద్ధి పనుల గురించి వివరించి పాఠశాలలో పూర్వపు స్థితి నేటి స్థితులను గురించి తెలియజేయాలి అన్నారు. ప్రతి ఏడాది పాఠశాలకు అందే నిధులు వాటి ఖర్చులు, పాఠశాలకు అందుతున్న టాయిలెట్ల మెటీరియల్, క్లీనింగ్ మెటీరియల్ తదితర అంశాలను ప్రధానోపాధ్యాయులు వారికి వివరించాలన్నారు. రాబోయే రెండు రోజుల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణ ఇచ్చి అన్ని అంశాలను వివరించి వారి అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఈ విషయాలను, వారి అభిప్రాయాలను ఫోన్ ద్వారా యాప్ లో నిక్షిప్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రభామంజరి, కె.వీరాస్వామి, బి.శ్రీనివాసరావు, వీఆర్ఎస్ సర్కార్, వి.శ్యాం ప్రసాద్, ఇంటి ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.



పాఠశాలల సోషల్ ఆడిట్ పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఉపాధి హామీ పనులపై అవగాహన

ఉండి: జాతీయ ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఫీల్డ్ అసిస్టెంట్ సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రాజేశ్వరరావు అన్నారు. ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు ,వీరవాసరం, భీమవరం మండలాలకు చెందిన టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఎన్ఆర్ఈజీఎస్ పనులు, వాటి ప్రగతిపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల నిర్వహణను చాలా మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల అవినీతి, పనుల్లో అవకతవకలు, తక్కువ కూలీ రావడం వంటివి జరుగుతున్నాయన్నారు. దీనివల్ల కూలీ నష్టపోతున్నాడన్నారు. దీనిపై ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ తప్పకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కూలీలను పనికి తీసుకెళ్లే సమయంలో మస్తరు వేయడంలో చాలా తేడాలు కనిపిస్తున్నాయన్నారు. మస్తరు వేసిన తరువాత చాలా మంది ఫీల్డ్‌అసిస్టెంట్‌లు మస్తరు క్లోజ్ చేయడం లేదన్నారు. దీనివల్ల అవకతవకలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. పనిచేసే ముందు ఒక ఫొటో, పనిచేస్తున్నప్పుడు మరో ఫొటో,నాలుగు గంటల తరువాత పని ముగించే ముందు మరో ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో పనిచేసిన వారికి రూ.272 అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వి.విజయలక్ష్మి, ఎంపీడీఓ ఏవీ అప్పారావు, ఈసీ శ్రీనివాస్, టీఏ లంకెపల్లి ఒమెగారాజు తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజేశ్వరరావు.

చర్చి నిర్మాణంపై విచారణ

ఉండి: మండలంలోని చెరుకువాడలో చర్చి నిర్మించేందుకు పంచాయితీ అధికారులు అనుమతి ఇవ్వడం లేదంటూ జిల్లా పంచాయితీ అధికారికి అందిన ఫిర్యాదుపై గురువారం గ్రామంలో డీఎల్పీఓ వీ రెడ్డియ్య విచారణ చేశారు. చెరుకువాడ నూతిగట్టు ఏరియాలో చర్చి నిర్మాణం చేసేందుకు స్థానిక పంచాయితీ అధికారులు అనుమతి ఇవ్వడం లేదంటూ జిల్లా పంచాయితీ అధికారికి పాస్టర్ కన్నిడి హేమ్‌కుమార్ ఫిర్యాదు చేశారని దీనిపై తాను విచారణ చేపడుతున్నట్లు రెడ్డియ్య తెలిపారు. ఫిర్యాదుదారు హేమ్‌కుమార్, స్థానిక పంచాయితీ కార్యదర్శి కే గోపాలకృష్ణ నుండి సంబంధిత ఫిర్యాదుపై పరిశీలన చేసి వివరాలు నమోదు చేసుకున్నానని తెలిపారు. పంచాయితీ అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్న కారణంగా కార్యదర్శి నిర్మాణదారులపై కేసు పెట్టారని, అలాగే సెంట్రింగ్ తొలగించారని దీనిని ఫోటోలు తీసుకుని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన సమాచారాన్ని జిల్లా అధికారులకు అందజేస్తానని రెడ్డియ్య తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కొండలరావు, సర్పంచ్ కొండవీటి సాంబశివరావు పాల్గొన్నారు.



చెరుకువాడలో విచారణ చేస్తున్న ఇన్‌చార్జ్ డీఎల్పీఓ రెడ్డియ్య

మేడే స్ఫూర్తితో పోరాటం

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను మేడే స్ఫూర్తితో తిప్పి కొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడే జేఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మేడే సన్నాహక విస్తృత సమావేశంలో గోపాలన్ మాట్లాడారు. నరేంద్రమోడీ ప్రధానిగా కార్మిక చట్టాలు మార్పులు చేస్తూ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎస్ సిరీస్, కలిపిండి సత్యనారాయణ, పిన్నింటి శ్రీను, నీలాపు రాజు, శ్రీనివాసరావు, పి.కృష్ణ పాల్గొన్నారు.

సిద్ధాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ఆకివీడు: కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం వరం లాంటిదని ప్యానల్ లాయర్ బంటుమిల్లి సురేష్ కుమార్ చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామ సచివాలయంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న భీమవరం కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమన్యాయం పొందడానికి లోక్ అదాలత్‌లు దోహదపడతాయన్నారు. తల్లిదండ్రుల పోషణ చట్టం, వినియోగదారుల చట్టం, బాధితుల నష్టపరిహారం చెల్లింపు చట్టం వంటివాటిపై ఆయన అవగాహన కల్పించారు. లాయర్ ఎన్.సుధీర్, ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు, కార్యదర్శి రాజేష్, హెడ్ కానిస్టేబుల్ భూషణం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, వీఆర్వో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సిద్ధాపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు

రైతులకు మెరుగైన సేవలను అందించాలి

నరసాపురం రూరల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అవసరమైన పంత రోడ్ల నిర్మాణాలు తదితర పనులను చేపట్టి పూర్తి చేస్తామని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గుబ్బల రాధాకృష్ణ అన్నారు. గరువారం నరసాపురం మండలంలోని సరిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మార్కెట్ కమిటీలో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా చురుగ్గా ధాన్యం సేకరణ జరగాలని సభ్యులు ప్రస్తావించారు. కార్యక్రమంలో తొలుత మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ నిర్మాణ పనులను సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, మార్కెట్‌యార్డు సిబ్బంది ఉన్నారు.

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు

పాలకోడేరు: మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ ప్రకారం ధాన్యం సేకరణ కొనుగోలు ప్రారంభమైంది. ఇందుకోసం 14 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలుకు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే 407 మంది రైతులు నుంచి 5,378 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణ రావు తెలిపారు. ఈ సీజన్లో మండలంలో 11,950 ఎకరాల లో రైతులు వరి 1121, 1156,1153 రకాలను పండించారన్నారు. 1121 రకం మాత్రమే ప్రస్తుతానికి సేకరించి కొనుగోలు చేశామన్నారు. 1156, 1153 రకాల విషయంలో ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. ఎకరానికి 52 బస్తాలు కొనుగోలు చేస్తున్నామన్నారు. 75 కేజీలు బస్తా కి మద్దతు ధర 1530, తేమ శాతం 17 ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి రైతు భరోసా కేంద్రం చైర్మన్ బొక్కా రాంబాబు, సర్పంచ్ చింతపల్లి వెంకటనారాయణ, వీఆర్వో మల్లేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ మధు, టెక్నికల్ అసిస్టెంట్ దివ్య, దుర్గ భవాని, తదితరులు ఉన్నారు



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

కాళ్ల: ప్రభుత్వం 1153 వరిరకం ధాన్యం కొనుగోలు చేయాలని మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. దొడ్డనపూడి గ్రామంలో 1153 రకాన్ని 60 ఎకరాల్లో సాగు చేశారు. తహసీల్దార్ కృష్ణారావు, ఏఓ సీహెచ్ జయవాసుకి, ఆర్డీఓ దాసిరాజు రైతులతో చర్చించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

మే 5న జాబ్ మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం భీమవరం రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో వచ్చే నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు గురువారం విలేకరులకు తెలిపారు. చెన్నైకు చెందిన డీస్టీల్ గ్రూఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులతో పాటు పదో తరగతి, ఇంటర్, డిప్లమో, బీఈ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్సులు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకుని హాజరుకావాలని శ్రీనివాసరాజు కోరారు.

ఘనంగా అన్న సమారాధన

సాక్షి, భీమవరం: స్థానిక హౌసింగ్ బోర్డుకాలనిలోని శ్రీ వెంకటసాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మల్లినీడి తిరుమలరావు బాబాకు గణపతి పూజ పుణ్యాహవాచనం, అన్నరాధన,విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీ చేగొండి వెంకటహరరామజోగయ్య అన్నసమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు వీధుల్లో బాబా పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. పిప్పళ్ళ ప్రసాదరావు బృందం శ్రీసాయి సంకీర్తన పాటలు భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నాదెండ్ల మనోహర్, కొటికలపూడి గోవిందరావు, వేగేశ్న కనకరాజు సూరి, మల్లినీడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకువాడలో రోడ్డు ప్రమాదం

ఉండి: మండలంలోని చెరుకువాడ శివారులో గురువారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదం చూపరులను భయభ్రాంతులకు గురి చేసింది.దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు నుండి ద్విచక్ర వాహనంపై వస్తున్న గుండాబత్తుల కుమారస్వామి అనే వ్యక్తిని వెనుక నుండి వస్తున్న కారు వేగంగా ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనం గాల్లో లేచి రోడ్డు ప్రక్కగా పడింది. అయితే వాహనదారుడు పక్కనే ఉన్న చెత్తలో పడిపోయాడు. కారు కూడా అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడి పక్కగానే వెళ్లడంతో అతను చనిపోయాడని అందరూ భావించారు. అయితే ద్విచక్ర వాహనదారుడికి గాని కారు నడిపిన డ్రైవర్‌కు గాని ఎటువంటి తీవ్రగాయాలు కాలేదు. కానీ ద్విచక్రవాహనం, కారు మాత్రం ముందుభాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదాన్ని పోలీసులు పరిశీలించారు గానీ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జాతరలో ఘర్షణలపై కేసు నమోదు

కాళ్ల: గ్రామంలో బుధవారం జరిగిన శ్రీమహాంకాళి అమ్మవారి జాతరలో పాత గొడవలు పురస్కరించుకుని కొంత మంది తనపై దాడి చేసి గాయపరిచారని పాపోలు ప్రసాద్ ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు. జాతర సందర్భంగా గొడవలు జరగకుండా చూసేందుకు కమిటీ వారు తనను నియమించారని, అయితే పాత గొడవలు పురస్కరించుకుని బండారి పండు, బండారి మణి, గునిశెట్టి చందు బీరు సీసాలతో తలపై కొట్టి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ప్రసాద్‌కు తలపై గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్‌పై కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మరో కేసులో జాతర సందర్భంగా నల్ల గంజి సురేష్‌పై ముగ్గురు దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. సురేష్ అమ్మవారి జాతర సందర్భంగా అక్కడికి వెళ్తున్న నేపథ్యంలో ఒక యువతిని మోటార్ సైకిల్‌తో ఢీకొన్నవంటూ యువతి భర్త, తండ్రి, మరో వ్యక్తి కలిసి తనపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పెనుగొండ: ఆపదలోఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా మానవత సంస్థ పనిచేస్తుందని మానవత ప్రెసిడెంట్ డాక్టర్ బాలచందర్ సాదే అన్నారు. గురువారం మునమర్రులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. తమవారిని కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబాలకు ఆసరాగా ఫ్రీజర్ బాక్సు, శాంతిరథం, అంబులెన్స్ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఛైర్మన్ కర్రి నరేంద్ర రెడ్డి, మండల ఛైర్మన్ తేతల వెంకటకుమార్ రంగారెడ్డి(దొరబాబు), కార్యదర్శి తానేటి భాస్కర్‌కుమార్, కొప్పిశెట్టి సూర్యనారాయణ, శివరామరెడ్డిలు పాల్గొన్నారు.